www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

భూములిచ్చిన రైతులకు
ఏరిహారం ఎప్పుడు..?



5 లో..

తీర్మానం లేకుండానే
వీవో భవనాల నిర్మాణం



3 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 296, మంగళవారం 24-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలి

- *హుడా ట్రక్ పార్కింగ్ భూముల వేలంపై బీజేపీ ధర్నా*
- *సంగీత్ నగర్‌లో నిరసనకు ఎంపీ ఈటల మద్దతు*
- *పేదల అసైన్డ్ భూములను కాపాడాలని డిమాండ్*
- *ప్రభుత్వ భూముల అమ్మకాలపై సర్కారుకు ప్రశ్నలు*

హైదరాబాద్, నవంబర్ 23

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం సంగీత్ నగర్‌లో హుడా (హెచ్‌యూడీఏ) ట్రక్ పార్కింగ్ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను, పేదలకు గతంలో అసైన్ చేసిన భూములను వేలం వేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాల కోసం భూములను సేకరించడం ప్రభుత్వాల బాధ్యత అని, కానీ ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారంలా విక్రయిస్తోందని ఈటల విమర్శించారు. భూములు అమ్మి ప్రభుత్వ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించాలనే ఆలోచన సరైనది కాదన్నారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో హైదరాబాద్‌లో ప్రజా అవసరాలకు ఉపయోగపడే భూములు

మిగతా 2 లో..



ఏసీబీ డైరెక్టర్‌గా ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

- *నవంబర్ 23న పదవీ బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి*
- *హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతల స్వీకారం*
- *తెలంగాణ అవినీతి నిరోధక శాఖకు నూతన డైరెక్టర్*

2 లో..

కార్యకర్తల త్యాగాలతోనే
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

- *కాంగ్రెస్ శ్రేణులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలి*
- *పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం*
- *రెండోసారి అధికారంలోకి రావడమే లక్ష్యం*
- *గాంధీభవన్‌తో భావోద్వేగ అనుబంధం ఉంది: ఉత్తమ్*

హైదరాబాద్, నవంబర్ 23 : కాంగ్రెస్ కార్యకర్తల కష్టం, త్యాగాల ఫలితంగానే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల టీడీపీ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం జరగాలని, వారి సేవలను నాయకత్వం గుర్తించాలని

మిగతా 2 లో..





గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం సహించేది లేదు

- *ప్రతినిధులకు అత్యుత్తమ ఆతిథ్యం అందించాలి :సీఎం రేవంత్*
- *ఫేషియల్ రికగ్నిషన్‌తో ప్రవేశానికి ఏర్పాట్లు*
- *విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణం వరకు ప్రత్యేక పర్యవేక్షణ*
- *తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా సమిట్ ప్రాంగణం*

హైదరాబాద్, నవంబర్ 23

తెలంగాణ గ్లోబల్ సమిట్ -2026కు హాజరయ్యే దేశ, విదేశీ ప్రతినిధుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమిట్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లు, ప్రతినిధులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రత, రవాణా, ఆతిథ్యం, వివిధ విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. విధుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠకు అనుగుణంగా సమిట్ నిర్వహణ ఉండాలని, ప్రతి విభాగం తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. గ్లోబల్ సమిట్‌కు వచ్చే ప్రతినిధులకు ప్రవేశం కల్పించే ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు భద్రతాపరంగా పటిష్ఠంగా ఉండేలా ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సమిట్‌కు హాజరయ్యే డెలిగేట్లతో విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ముందుగానే శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతినిధులకు అవసరమైన ఆహార సదుపాయాల కోసం ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని, నిరంతరాయంగా మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి సమిట్ కార్యక్రమాలు ముగించుకుని తిరిగి వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రతినిధుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని సూచించారు. గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో తెలంగాణ సంస్కృతి,

మిగతా 2 లో..



తెలంగాణలో అవినీతి పాలన సాగుతుంది

- * కరీంనగర్ మహా పాదయాత్రలో నితిన్ నబీన్
- * రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడి విమర్శలు
- * వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయమన్న బండి సంజయ్



కరీంనగర్, నవంబర్ 23

కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్రలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లి దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో ఉందంటూ విదేశాల్లో వ్యాఖ్యానించడం సరికాదని, దేశాభివృద్ధి గురించి ఆలోచించకుండా తన కుటుంబ అభివృద్ధిపైనే రాహుల్ దృష్టి పెట్టారని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీకి ఏటీఎంలా పనిచేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లో ప్రజల నుంచి లభించిన స్పందన బీజేపీకి ఉన్న ఆదరణకు నిదర్శనమని పేర్కొంటూ, కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్ష ఇండియా కూటమి అనవసర రాద్ధాంతం చేస్తోందని

మిగతా 2 లో..

జాతీయ రహదారిపై దగ్ధమైన పార్సెల్ లారీ

- *చీకటిగూడెం వద్ద ఒక్కసారిగా చెలరేగిన మంటలు*
- *పూర్తిగా కాలిపోయిన పార్సెల్ సరుకు వాహనం*
- *నీళ్లు సరిపోక మరో ఫైర్ ఇంజన్‌కు పోలీసుల ఏర్పాటు*

నల్గొండ, నవంబర్ 23 : నల్గొండ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కేతపల్లి మండలం చీకటిగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై పార్సెల్ సరుకుతో వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు వాహనం అంతటా వ్యాపించడంతో లారీ పూర్తిగా దగ్ధమైంది.

మిగతా 2 లో..



ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలు
వేగవంతం చేయాలి



- *కరీంనగర్, జనగామ, సిద్ధిపేట మెడికల్ కాలేజీలపై సమీక్ష*
- *హాస్టళ్ల నిర్మాణాలు నిర్దిత గడువులో పూర్తి చేయాలి*
- *వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపైనా ఆరా*
- *నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి: మంత్రి దామోదర*

2 లో..

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
మంగళవారం
24 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

తెలంగాణలో అవినీతి పాలన సాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)





నితిన్ నబీన్ విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనకు సంబంధించిన ప్రక్రియపై తాము ఇచ్చిన వివరణకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని చెప్పారు. రాహుల్‌గాంధీ తరచూ ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవ పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. దేశంలో 13 కోట్ల ఓట్లు చోరీ అయ్యాయని రాహుల్ చెబుతున్నారని ప్రస్తావిస్తూ, మూడు కోట్ల మంది మరణించిన తర్వాత కూడా వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా? అని ప్రశ్నించారు. ఆరు కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినప్పుడు వారికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండాలా? అని నిలదీశారు. చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించాలని రాజ్యాంగం చెప్పలేదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని రాహుల్‌గాంధీ జేబులో పెట్టుకుంటే, తాము హృదయంలో పెట్టుకుని గౌరవిస్తామని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో గతంలో ఒక అవినీతి పాలనకు ప్రజలు ముగింపు పలికారని, ప్రస్తుతం అంతకుమించిన అవినీతి పాలన కొనసాగుతోందని నితిన్ నబీన్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ త్వరలోనే పదవి నుంచి దిగిపోతారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారని ప్రస్తావించిన ఆయన, వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి ఎర్రకోటపై కాషాయ జెండా ఎగురుతుందని అన్నారు. మోదీ కంటే ముందు ఏ ప్రధానమంత్రి కూడా దేశ సైనికులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకోలేదని పేర్కొన్నారు. విదేశీ టూల్‌కిట్ ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణకు చెందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావును గౌరవించాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు ఎప్పుడూ లేదని, ఆయనకు తగిన గౌరవం కల్పించే పని బీజేపీ ప్రభుత్వమే చేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారా? అని సభకు హాజరైన వారిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీకి ఆదరణ లేదని చెబుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకసారి కరీంనగర్‌కు వచ్చి చూడాలని సవాల్ విసిరారు. కరీంనగర్‌లో ప్రజల నుంచి లభిస్తున్న స్పందనను చూస్తే రాష్ట్రంలో బీజేపీ బలం ఏమిటో అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ నేతలు తమ పార్టీకి 90 సీట్లు వస్తాయని చెబుతున్నారని ప్రస్తావిస్తూ, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించనందుకా? వృద్ధుల పింఛన్లను రూ.4 వేలకు పెంచనందుకా? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఎల్నినో ప్రభావంతో రైతాంగం కష్టాలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులకు అవసరమైన సహాయం అందించడం లేదని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయని నిలదీశారు.

తెలంగాణ ప్రజలు ఇప్పటికే రెండుసార్లు బీఆర్ఎస్‌కు, ఒకసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈసారి మాత్రం బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలు నిర్ణయించుకున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు రావాలంటే బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు నితిన్ నబీన్ కూడా కేంద్రంలో మోదీ నాయకత్వంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో జాతీయ అధ్యక్షుడు పాల్గొనడం, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం, వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయంపై ధీమా వ్యక్తం చేయడం పార్టీ శ్రేణుల్లో రాజకీయ ఉత్సాహాన్ని నింపే ప్రయత్నంగా నిలిచింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీజేపీ నేతలు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కార్యకర్తల త్యాగాలతోనే
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనను విజయవంతంగా కొనసాగిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగాలన్నలక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. రెండోసారి అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ఏఐసీసీ ఇన్‌చార్జి సందీప్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఒకే నియోజకవర్గం నుంచి ఒకే పార్టీ తరఫున వరుసగా ఏడుసార్లు గెలిచిన అనుభవం తనకు ఉందని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

తెలంగాణ ప్రజలు, రైతాంగానికి మేలు జరిగేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. సాగునీటి రంగంలో కృష్ణా, గోదావరి జలాలను గతంలో ఎన్నడూ లేని స్థాయిలో వినియోగిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అత్యధిక వ్యవసాయ విస్తీర్ణం నమోదైందని, వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణలోనూ రికార్డు స్థాయికి చేరుకున్నామని వివరించారు. రైతులకు సాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సాగునీటి ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్ఎల్‌బీసీ, డిండి తదితర ప్రాజెక్టులు పూర్తికాలేదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని, ఎన్నికల్లోపు పెండింగ్ పనులను పూర్తిచేసేలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తితో రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామన్నారు. గాంధీభవన్‌తో తనకు ఎంతోకాలంగా భావోద్వేగ అనుబంధం ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల శ్రమను గుర్తిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయాలు, చారిత్రక వైభవం ప్రతిబింబించాలని రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమ్మక్క-సారలమ్మ ఆలయ ప్రాంగణంలోని తోరణాల నమూనాలను సమిట్ వేదిక అలంకరణలో ఉపయోగించాలని సూచించారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పేలా ప్రాంగణ రూపకల్పన ఉండాలని, రాష్ట్ర కళలు, సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సమిట్‌కు వచ్చే విదేశీ అతిథులకు తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని పరిచయం చేయడంతోపాటు రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపును ప్రపంచ వేదికపై ప్రదర్శించే అవకాశంగా ఈ కార్యక్రమాన్ని మలచాలని పేర్కొన్నారు. ఏర్పాట్లలో స్థానిక సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి అంశంలోనూ తెలంగాణ ప్రత్యేకత కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమ్మిట్‌కు ముఖ్యమైన ప్రతినిధులను ఆహ్వానించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. కీలకమైన దెలిగేట్లకు ఆహ్వానాలు పంపే బాధ్యతను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబుకు అప్పగించాలని అధికారులకు తెలిపారు. దేశ, విదేశాల్లో పేరుపొందిన విశ్వవిద్యాలయాలు గ్లోబల్ సమిట్‌లోని విద్యా ప్రదర్శన విభాగంలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను అంతర్జాతీయ స్థాయి ప్రతినిధుల ముందుకు తీసుకువచ్చేలా విద్యా ప్రదర్శన విభాగాన్ని తీర్చిదిద్దాలని అన్నారు. ఆహ్వానాల పంపిణీ నుంచి ప్రతినిధుల రాక, వసతి, రవాణా, కార్యక్రమాల నిర్వహణ వరకు ప్రతి అంశాన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గ్లోబల్ సమిట్‌లో భాగంగా నిర్వహించే ఎయిర్ షోతోపాటు ఇతర కార్యక్రమాలను వీక్షించే అవకాశం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కల్పించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలపై అవగాహన పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సమిట్ ఏర్పాట్లలో విద్యార్థుల భాగస్వామ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతినిధులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించడం, అంతర్జాతీయ సంస్థలు, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గ్లోబల్ సమిట్-2026ను రాష్ట్ర ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిచెప్పే కార్యక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఏసీబీ డైరెక్టర్‌గా ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నవంబర్ 23 : తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నూతన డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నవంబర్ 23, 2026న హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు అధికారిక సమాచారం వెల్లడైంది. రాష్ట్రంలో అవినీతి నిరోధక చర్యలను పర్యవేక్షించే కీలక విభాగానికి ఆయన డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ శాఖలు, వివిధ సంస్థల్లో అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు, ఆరోపణలపై ఏసీబీ విచారణలు నిర్వహిస్తుంది. అవినీతి నిరోధక శాఖ పరిధిలో నమోదయ్యే కేసులు, దర్యాప్తులు, తనిఖీలు, ఇతర కార్యాచరణకు డైరెక్టర్ నాయకత్వం వహిస్తారు. ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడంతో తెలంగాణ ఏసీబీకి కొత్త నాయకత్వం బాధ్యతలు చేపట్టినట్లయింది. శాఖలో కొనసాగుతున్న కార్యకలాపాలు, పరిపాలనా వ్యవహారాల నిర్వహణలో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు.

రాష్ట్రంలో అవినీతికి సంబంధించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం, ప్రభుత్వ కార్యాలయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం ఏసీబీ ప్రధాన విధులు. ఈ నేపథ్యంలో నూతన డైరెక్టర్ బాధ్యతల స్వీకరణతో శాఖ తదుపరి కార్యాచరణపై ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మిగలవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలా? లేక వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేయాలా? అని ప్రశ్నించారు.

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇదే భూమిని డీఎల్ఎఫ్ సంస్థకు అప్పగించే ప్రయత్నం చేసినప్పుడు వ్యతిరేకించానని ఈటల గుర్తుచేశారు. పళ్ల దుకాణాలు, బజ్జీ, ఇడ్లీ బండ్లు నడుపుకునే వారు, రోజువారీ కూలీలు, ఇళ్లల్లో పనిచేసే పేదలకు ఇళ్లు ఎక్కడ నిర్మిస్తారని ప్రశ్నిస్తూ ఆ నిర్ణయాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. అప్పట్లో డీఎల్ఎఫ్‌కు కేటాయించిన 19 ఎకరాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయని పేర్కొన్నారు. మెట్రో నిర్మాణం కోసం ప్రభుత్వం విలువైన భూములను అప్పగించిందని, వాటిలో వాణిజ్య సముదాయాలు నిర్మించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారని ఆరోపించారు. వై జంక్షన్ వద్ద కూడా ఏడు ఎకరాల భూమిలో భారీ మాల్ నిర్మించారని తెలిపారు.

60 నుంచి 80 ఏళ్ల క్రితం పేదలకు అసైన్ చేసిన భూములను వారు ఎంతో శ్రమించి సాగులోకి తెచ్చుకున్నారని ఈటల అన్నారు. రాళ్లు తొలగించి, చెత్తను శుభ్రం చేసి, బోర్లు, బావులు తవ్వి కూరగాయలు పండించుకుంటూ జీవిస్తున్న రైతుల భూములను తిరిగి తీసుకునే ప్రయత్నం చేయడం అన్యాయమని విమర్శించారు. 70 ఏళ్ల క్రితం ఇచ్చిన అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు అమ్ముకునే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పేదల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతోందని విమర్శించిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని అనుసరిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో సొంత ఇళ్లు లేని పేదలు, అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా ప్రస్తావించారు. నియోపోలిస్ వంటి ప్రాంతాల్లో ఎకరం రూ.250 కోట్ల నుంచి రూ.270 కోట్ల వరకు ధర పలుకుతోందని, ఇప్పటికే రూ.26 వేల కోట్లకు పైగా విలువైన భూములను విక్రయించారని ఈటల ఆరోపించారు. తన అంచనా ప్రకారం రూ.50 వేల కోట్ల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారని, దీనివెనుక అక్రమ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. కూకట్‌పల్లి సమీపంలోని ఐడీఎల్ భూములను గతంలో పరిశ్రమ ఏర్పాటు కోసం రైతుల నుంచి సేకరించి ఉచితంగా ఇచ్చారని, ప్రస్తుతం పేలుడు పదార్థాల ఉత్పత్తి నిలిచిపోయిన నేపథ్యంలో ఆ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఫీనిక్స్ సంస్థకు గతంలో 100 ఎకరాలు కేటాయించడంపై కూడా ఆరోపణలు చేశారు. ఐడీఎల్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే సుమారు రూ.30 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని, ఆ నిధులతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతు బీమా, రైతు బంధు, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, పేదల ఇళ్ల నిర్మాణానికి ఖర్చు చేయవచ్చని తెలిపారు. రూ.40 వేల కోట్ల రైతు రుణమాఫీని ఒకేసారి చేస్తానన్న ప్రభుత్వం ఈ భూముల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ధర్నాలో బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, మాజీ కార్పొరేటర్లు మహేందర్, శేషగిరి, శ్రీకర్ రావు, ఇతర నాయకులు, కార్యకర్తలు, భూముల పరిరక్షణ కోరుతున్న రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- **కరీంనగర్, జనగామ, సిద్ధిపేట మెడికల్ కాలేజీలపై సమీక్ష**
- **హాస్టళ్ల నిర్మాణాలు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి**
- **వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపైనా ఆరా**
- **నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి: మంత్రి దామోదర**

హైదరాబాద్, నవంబర్ 23 : తెలంగాణలో వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. కరీంనగర్, జనగామ, సిద్ధిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా నిర్మిస్తున్న హాస్టళ్ల పనులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పురోగతిపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కళాశాల భవనాలతో పాటు విద్యార్థుల వసతి కోసం చేపడుతున్న హాస్టళ్ల నిర్మాణాలను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల ఆలస్యానికి కారణాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ఉమ్మడి వరంగల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అంశాలను ముందుగానే పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వైద్య విద్యను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కొత్త వైద్య కళాశాలలు, హాస్టళ్లు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయితే వైద్య విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ప్రజలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, వైద్య విద్య సంచాలకురాలు డాక్టర్ వాణి పాల్గొన్నారు. ఆరోగ్యశాఖ, రోడ్లు భవనాల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరై నిర్మాణ పనుల వివరాలను మంత్రులకు వివరించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసేందుకు శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి అధికారులకు సూచించారు.

జాతీయ రహదారిపై దగ్ధమైన పార్సెల్ లారీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. ప్రమాద సమయంలో లారీలో ఉన్న సరుకు కూడా మంటలకు ఆహుతైనట్లు సమాచారం.

జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలో అకస్మాత్తుగా మంటలు రావడంతో వాహనదారులు అప్రమత్తమయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో లారీని పూర్తిగా కాలిపోకుండా అడ్డుకోవడం సాధ్యపడలేదు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిప్రమాదం కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లారీ పూర్తిగా మంటల్లో చిక్కుకోవడంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు అగ్నిమాపక చర్యలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే మంటలు ఆర్పే క్రమంలో ఫైర్ ఇంజన్‌లోని నీళ్లు పూర్తయ్యాయి. దీంతో సహాయక చర్యలకు కొంత ఆటంకం ఏర్పడింది. పరిస్థితిని గుర్తించిన పోలీసులు సూర్యాపేట నుంచి మరో ఫైర్ ఇంజన్‌ను ఘటనా స్థలానికి రప్పించారు. అదనపు అగ్నిమాపక వాహనం సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. లారీ దగ్ధం కావడంతో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు, లారీలో ఉన్న సరుకు వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా అనే వివరాలు కూడా వెల్లడికావాల్సి ఉంది. పోలీసులు ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

తీర్మానం లేకుండానే వీవో భవనాల నిర్మాణం

- అధికారులను తప్పుదోవ పట్టించేలా తర్వాత తీర్మానం

- ప్రజావాణిలో కలెక్టర్‌కు మహిళా సంఘాల ఫిర్యాదు

- ఒకేచోట రెండు భవనాలపై పెనగడప వాసుల ఆగ్రహం



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్) : ఎలాంటి గ్రామ పంచాయతీ తీర్మానం, గ్రామ సభ ఆమోదం లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా మహిళా సమాఖ్య (వీవో) భవన నిర్మాణాలను చేపట్టారని పెనగడప గ్రామ మహిళా సంఘాల సభ్యులు ఆరోపించారు. ముందుగా నిర్మాణాలు ప్రారంభించి, ఆ తర్వాత తీర్మానం చేసుకుని అధికారులకు సమర్పించారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి (గ్రీవెన్స్)లో ఫిర్యాదు చేశారు. పెనగడప గ్రామ పంచాయతీ పరిధిలో 'వెన్నెల', 'నాగేంద్ర' పేరుతో రెండు మహిళా సమాఖ్య గ్రూపులు ఉన్నాయి. ఈ రెండు గ్రూపుల సమావేశాల నిమిత్తం ఎంజఎన్ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా రెండు భవనాలు మంజూరయ్యాయి. నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ తీర్మానం లేదా గ్రామసభ ఆమోదం పొందిన తర్వాత స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణాలు చేపట్టాలి. కానీ, ఎలాంటి ముందస్తు తీర్మానం లేకుండానే పెనగడప శివారు గ్రామమైన ములుగ్గుడెంలోని పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లను నరికివేసి, ఒకే ప్రదేశంలో ఈ రెండు భవనాల నిర్మాణాలను చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెనగడప పంచాయతీ పరిధిలో మొత్తం 45 మహిళా గ్రూపులు ఉండగా, కేవలం 5 గ్రూపులు మాత్రమే ములుగ్గుడెంలో ఉన్నాయని మహిళా సంఘాల నేతలు తెలిపారు. పెనగడప గ్రామానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ములుగ్గుడెంలో ఒకేచోట రెండు భవనాలను నిర్మించడం వల్ల పెనగడపలోని 40 గ్రూపుల మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా పనులు మొదలుపెట్టి, ఆ తర్వాత తీర్మానం పేరుతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని పెనగడపకు చెందిన వెన్నెల గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు ఎస్‌కే షబానా బేగం, కార్యదర్శి కె.సుధ, వార్డు సభ్యులు సీహెచ్.సురేశ్ తదితరులు వినతిపత్రంలో కోరారు.

ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు



కామేపల్లి, నవంబరు 23 (భద్రాద్రిన్యూస్): బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ 59వ జన్మదిన వేడుకలను సోమవారం కామేపల్లి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య, ప్రధాన కార్యదర్శి కాట్రాల రాంబాబు స్వామి, ఉపాధ్యక్షులు సామా మోహన్ రెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, నాయకులు మూడ్ కృష్ణ ప్రసాద్, ఆదూరి ప్రసాద్, అజ్మీరా రాజు, చిపల్లపల్లి శ్రీనివాస్, గడ్డం వెంకటేశ్వర్లు, మేదర శ్రీనివాస్, కన్నమాల రాంబాబు స్వామి, ఆరుద్ర బ్రహ్మం, మంచాల వెంకన్న, ముప్పాల రాము, గంట సంపత్, గునిగంటి వెంకటేశ్వర్లు స్వామి, నిమ్మల సైదులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పులి శ్రీనివాస్ నియామకం



కోదాడ, నవంబర్ 23(భద్రాద్రి న్యూస్): సూర్యాపేట జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం నూతన ప్రధాన కార్యదర్శిగా పులి శ్రీనివాస్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ కో-చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు మల్లెపాక వెంకన్న మాదిగ, జాన్ విల్సన్ మాదిగ, పిడమర్తి సైదులు మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు చెబర్తి యాదగిరి మాదిగ, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ వల్లపట్ల కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నియామక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పులి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ స్థాయి నాయకులు మరియు పలువురు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పులి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కామేపల్లి లో తూతూ మంత్రంగా 'ప్రజావాణి

- కీలక శాఖల అధికారులు గైరాజర్... ఎంపీడీవో మౌనం!



కామేపల్లి, నవంబరు 23 (భద్రాద్రి న్యూస్): ప్రతిష్ఠాత్మక 'సీఎం ప్రజావాణి' కామేపల్లి మండలంలో తూతు మంత్రంగా కొనసాగుతుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ ప్రజావాణి కి ఉదయం 11 దాటినా కీలక శాఖల అధికారులు ప్రతిసారి గైరాజర్ అవుతున్నారు. 24 మంది అధికారులు హాజరు కావలసి ఉండగా కేవలం 12 మంది మాత్రమే హాజరయ్యారు. రెవెన్యూ, అగ్రికల్చర్, అధికారులు ఆలస్యంగా రాగా వైద్య, పోలీస్, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ, హార్టికల్చర్, మత్స్య శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరై తమ స్థానంలో క్రింది స్థాయి సిబ్బందిని పంపుతున్నా, అన్ని శాఖల అధికారులు కచ్చితంగా ప్రజావాణి కి అన్ని శాఖల ఉన్నతాధికారులు హాజరు కాలని ఎంపీడీవో సోమ్ లాల్ ఆదేశాలు ఇచ్చిన ఆదేశాలు ఇచ్చిన అవి అడియాసలు గా మారాయి జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న ఈ పలు శాఖల అధికారుల పై తక్షణమే చర్యలు తీసుకుంటే ప్రజావాణి కార్యక్రమం సవ్యంగా కొనసాగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దేశ ఆర్థిక ప్రగతిలో దివ్యాంగులు భాగస్వాములు కావాలి

- స్వయం ఉపాధి వైపు అడుగులేయాలి

- ఎంపీడీవో ధారావత్ సోమలాల్





కామేపల్లి, నవంబర్ 23 (భద్రాద్రిన్యూస్): సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించి దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములవుతారని ఎంపీడీవో ధారావత్ సోమలాల్ అన్నారు. గోవింద్రాల పంచాయతీ కార్యాలయంలో ఎస్.ఆర్.డి.ఎస్ -- ఎనేబుల్ ఇండియా ఆధ్వర్యంలో 35 మంది గిరిజన దివ్యాంగులకు పది రోజులపాటు నిర్వహించిన వ్యాపార నైపుణ్య శిక్షణ ముగిసింది. ఎస్.ఆర్.డి.ఎస్ సంచాలకులు గడ్డం రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మన్యూనతను వీడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకుని కిరాణా, కుట్టుపని, పశుపోషణ, చిరు వ్యాపారాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. వ్యాపారాల ప్రారంభానికి అధికారుల తరఫున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 35 మందికి ఎంపీడీవో చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఎం. వెంకట రామారావు, అధ్యాపకులు జగదీశ్ రెడ్డి, ఉప సర్పంచ్ తార, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

కమలాపురం రైతులకు న్యాయం చేయాలి..

- ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించాలి!

- 45 మంది రైతుల పంట చేతికొచ్చే వరకు కాలువ నిర్మాణ పనులు నిలిపివేయాలి..

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు భూక్యా శివ నాయక్ డిమాండ్

కారేపల్లి, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్ -- రాములు): సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న కమలాపురం రైతులకు ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా నాయకుడు భూక్యా శివ నాయక్ డిమాండ్ చేశారు. రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని, సాగులో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు కాంట్రాక్టు నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం కారేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం భూక్యా శివ నాయక్ మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం 2021లో కమలాపురం గ్రామానికి చెందిన 45 మంది రైతులకు సంబంధించిన 54 ఎకరాల భూమిని అధికారులు సేకరించారని తెలిపారు. అప్పట్లో ఎకరాకు రూ.10.50 లక్షల చొప్పున పరిహారం నిర్ణయించినప్పటికీ, పరిహారం అందడంలో జాప్యం జరగడంతో రైతులు తమ భూముల్లో వ్యవసాయ పనులను కొనసాగించారని వివరించారు. ఈ ఏడాది ఆగస్టు 2న పరిహారం అందినప్పటికీ, అప్పటికే రైతులు తమ భూముల్లో వరి, పత్తి తదితర పంటలను సాగు చేశారని, ప్రస్తుతం అవి చేతికొచ్చే దశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ తరుణంలో కాంట్రాక్టు నిర్మాణ పనులు చేపడితే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలు పూర్తిగా చేతికొచ్చే వరకు నిర్మాణ పనులకు తగిన గడువు ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. భూములు సేకరించిన సమయంలో నిర్ణయించిన పరిహారం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేదని, 2026 మార్కెట్ ధరల ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. కమలాపురం రైతులకు



సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించకపోతే అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు, ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

డిసెంబర్ 29న హైదరాబాద్‌లో 'ప్రజాగర్జన'

- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి.వై.పుల్లయ్య



కామేపల్లి, నవంబరు 22 (భద్రాద్రిన్యూస్):- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబర్ 29న హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన, బహిరంగ సభ (ప్రజాగర్జన) నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి.వై.పుల్లయ్య తెలిపారు. ఆదివారం కొత్తలింగాలలో ఎన్.వి.రాకేష్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర, పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాగర్జనకు కార్మికులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆవుల అశోక్, జాటోత్ కృష్ణ, టి.ఝాన్సీ, ఎస్.కె.లాల్‌మియా, ఉపేందర్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, సక్రు, రామ్‌సింగ్ పాల్గొన్నారు.

10 లక్షల టన్నుల బొగ్గు రవాణా

- మైలురాయి దాటిన నైనీ బొగ్గు గని

- అభినందనలు తెలిపిన యాజమాన్యం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్): ఒడిశా రాష్ట్రంలో సింగరేణి ప్రారంభించిన నైనీ బొగ్గు గని ఆదివారం నాటికి తొలిసారిగా 10 లక్షల టన్నుల బొగ్గు రవాణా మైలురాయిని దాటింది. రాష్ట్ర ప్రభుత్వం మరీ ముఖ్యంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ కృషితో ఈ గనికి అన్ని అనుమతులు లభించి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఈ గని నుంచి బొగ్గు రవాణా ప్రారంభమైంది. కాగా రాష్ట్ర ఇంధన అవసరాలకు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నైనీ బొగ్గును రైలు మార్గం ద్వారా రవాణా జరుపుతున్నారు. అలాగే ఇతర రాష్ట్రాలకు కూడా నైనీ బొగ్గుని సరఫరా చేయటం జరుగుతుంది. గనిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన తరువాత తొలిసారిగా 10 లక్షల టన్నుల మైలురాయిని దాటిన నైనీ బొగ్గు గని అధికారులు ఉద్యోగులు సిబ్బందికి సింగరేణి యాజమాన్యం తన అభినందనలు తెలిపింది. ఇదే విధంగా ఇకపై కూడా అనేక మైలురాళ్లు దాటాలని జాతి సేవకు అంకితమై పని చేయాలని సంస్థ చైర్మన్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ గనిలో ఏడాదికి 60 లక్షల టన్నుల బొగ్గును(6 మిలియన్ టన్నులు) ఉత్పత్తి చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయగా మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలతో పాటు ఎన్టీపీసీకి చెందిన స్థానిక థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడానికి సింగరేణి ముందుకు వచ్చింది. నైనీ గనిలో లభించే (గ్రేడ్-11 జి-11) బొగ్గుకు మంచి డిమాండ్ ఉంది. నైనీ గని నుండి సమీపంలోని రైల్వే సైడింగ్ వరకు ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా చేస్తున్నారు. త్వరలోనే ఇక్కడ ఇతర బొగ్గు ఉత్పత్తి కంపెనీల వారితో కలిసి ఉమ్మడి భాగస్వామ్యంతో ఒక రైల్వే కారిడార్ నిర్మాణానికి కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి. మొత్తం మీద నైనీ బొగ్గు గనికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు.





శివాలయాల్లో కార్తీక శోభ

- భక్తుల కిటకిట

- నేడు గురు హరిహర మందిరంలో సహస్ర దీపాలంకరణ



కామేపల్లి, నవంబరు 23 (భద్రాద్రిన్యూస్): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కామేపల్లిలోని శ్రీ గురు హరిహర మందిరంతో పాటు ఊటుకూరు, పండితాపురం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి దీపారాధనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పరమశివునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు నిర్వహించి, కార్తీక మాస విశిష్టతను భక్తులకు వివరించారు.

నేడు 1008 దీపోత్సవం.. : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం శ్రీ గురు హరిహర మందిరంలో సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షులు గొట్టిపర్తి శివాజీ తెలిపారు. 1008 దీపోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
మంగళవారం
24 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

అంగన్వాడీ ఆయాలకు పెన్షన్, పెండింగ్ అద్దెలు చెల్లించాలి

- ఏఐటీయూసీ నేత గోనె మని



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్) : కొత్తగూడెంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో సోమవారం నిర్వహించిన అసోసియేషన్ జిల్లా బాధ్యుల సమావేశంలో ఏఐటీయూసీ నేత గోనె మని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న అంగన్వాడీ ఆయాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ ఆయాలుగా పనిచేస్తున్నారనే కారణంతో వారికి ప్రభుత్వ పెన్షన్ సౌకర్యం కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు ఏడాది కాలంగా అద్దెలు చెల్లించకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవన యజమానుల ఒత్తిడితో సిబ్బంది తమ సొంత డబ్బులతో అద్దెలు చెల్లించాల్సి వస్తోందని, ఇది వారిపై అదనపు ఆర్థిక భారంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ అద్దెలను విడుదల చేసి అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఆటంకాలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు కమల, భవాని, రమ, లక్ష్మి, గుణ, నీలవేణి, షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్) : ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన ప్రజల నుండి భూ సమస్యలు, పింఛన్లు, ఇళ్లు తదితర వినతులు స్వీకరించారు. విత్తన నష్టపరిహారం, కారుణ్య ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, పోడు పట్టాలకు సంబంధించిన వినతులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి: ఏఈఓ నిమ్మపిచ్చయ్య



కోదాడ, నవంబర్ 23(భద్రాద్రి న్యూస్): ఎల్నీనో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులు యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేసి వ్యవసాయ శాఖకు సహకరించాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) నిమ్మపిచ్చయ్య సూచించారు.
సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని భిక్యాతండాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే ఆరుతడి పంటల సాగు వల్ల రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగులోత్ జాన్సీ, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

-- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్) : ఈ నెల 29న జరిగే దీక్ష దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన దీక్ష దివస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితి.. ఆనాటి టీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్ మలిదశ తెలంగాణ ఉద్యమానికి తెరలేపారన్నారు. తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో 2009, నవంబరు 29వ తేదీన ఆమరణ దీక్షకు పిలుపునిచ్చిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాధవత్ శాంతి, మల్లెల రవిచంద్ర, రాజు గౌడ్, దామోదర్, బీమా శ్రీధర్, అనుదీప్ రుక్కు, సాగర్, జగన్, కొట్టి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైరాలో ఘనంగా డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు

- స్వేరోస్, ఆర్.ఎస్.పి, కోర్ టీం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు, కేక్ కటింగ్, ఉప ఐక్యత ఆత్మగౌరవం సామాజిక చైతన్యానికి ప్రత్యేకంగా సంబరాలు





వైరా, నవంబర్ 23, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ కామిశెట్టి కల్యాణ మండపంలో సోమవారం పడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి, మాజీ గురుకులాల సెక్రెటరీ, స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు వైరాలో ఘనంగా ఉత్సాహపరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, డాక్టర్ ఆర్ ఎస్. ప్రవీణ్ కుమార్ స్వేరోస్ నెట్వర్క్ ద్వారా సమాజంలో సమస్త గతి మార్పులు తీసుకురావడానికి, అనేక వినూత్న కార్యక్రమాలు చేసి, ఈరోజు పేద వర్గాల అభ్యున్నతి కోసం ప్రజల పక్షంగా ఎప్పుడు ఉండే త్యాగపూరిత విషయాలు స్మరించుకుంటూ ముందుకు వెళ్తున్నారని ముఖ్య అతిథులు కొనియాడారు. రాబోవు రోజుల్లో డాక్టర్ ప్రవీణ్ కుమార్ గొప్ప సంస్కరణ కర్తగా ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేస్తూ ప్రవీణ్ కుమార్ ఆశయాలకు అనుగుణంగా మీరందరూ కూడా ఉండాలని అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త ఆర్ జె సి కృష్ణ, చిలక చిన్న కోటయ్య, బొమ్మెర రామ్మూర్తి, అప్పం సురేష్, కోరిపల్లి శ్రీను తెలియజేశారు. అదేవిధంగా మండలాల నుంచి ముఖ్య నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

అనంతరం భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో సమాజంలో విద్యా చైతన్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందించేందుకు చేస్తున్న కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద,బడుగు,బలహీన వర్గాల పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి ఒక్కరూ విద్యావంతులై ఆత్మగౌరవంతో జీవించాలని ఆయన చేస్తున్న సామాజిక ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని కొరియాడారు. ఆయన ఆశయ సాధన కోసం స్వేరోస్ కుటుంబ సభ్యులుగా, బహుజన ఉద్యమ శక్తులుగా, ఐక్యంగా పనిచేస్తూ విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వ సాధనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ జన్మ దిన వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే సామాజిక బాధ్యతకు నాంది



కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉదయ్ స్వేరో, శ్రీకాంత్ స్వేరో, శరత్ స్వేరో, నారాయణ స్వేరో, మహేష్ స్వేరో, ప్రవీణ్ కుమార్ స్వేరో, సాయికుమార్ స్వేరో, గణేష్ స్వేరో, దుర్గాప్రసాద్ స్వేరో, అన్వర్, రాంబాబు, స్వారోస్ భీమ్ వారియర్స్, వివిధ రకాల ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ఆధ్యాత్మిక వెలుగులు.. నేత్రపర్వంగా గంగా హారతికి ఏర్పాట్లు

- కార్తీక పౌర్ణమి వేళయే అన్నపురెడ్డిపల్లి ఆలయానికి పోటెత్తనున్న భక్తజనం
- అరటి తోరణాలు, బంతిపూలు, విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు
- కోనేటి వద్ద 108 రకాల హారతులు, జ్వాలాతోరణం, దీపోత్సవానికి సర్వం సిద్ధం
- తరలిరానున్న ప్రముఖులు.. భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది ముమ్మర ఏర్పాట్లు





అన్నపురెడ్డిపల్లి,నవంబర్23 (భద్రాద్రి న్యూస్):
కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక సంద్రంగా మారింది. హరిహరులు కొలువైన ఈ పుణ్యక్షేత్రంలో కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్న కోనేటి గంగా హారతి కి సర్వం సిద్ధమైందని వేళాయే పౌర్ణమి వేళ విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తానున్నారు. వేడుకల కోసం ఆలయ ప్రాంగణాన్ని అరటి తోరణాలు, బంతిపూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, దేవాలయాన్ని కనులపండువగా విద్యుత్ కాంతులతో అలంకరిస్తున్నారు.
ఒకే వేదికపై వైకుంఠ కైలాస దర్శనం కార్తీక శుద్ధ పాడ్యమి నుంచి బహుళ అమావాస్య వరకు సాగే మాసోత్సవాల్లో పౌర్ణమి వేడుక అత్యంత ప్రధానమైనది. ఆ వైకుంఠనాథుడు వేంకటేశ్వరుడు, కైలాసనాథుడు పరమేశ్వరుడు ఒకే వేదికపై గంగా ఒడ్డున దర్శనమివ్వడం భక్తులకు దక్కే మహాభాగ్యమని పండితులు పేర్కొంటున్నారు. హరిహరులు నడయాడిన ఈ పుణ్యభూమిలో ఒక్క దీపం వెలిగించినా ముక్కోటి దీపాలు వెలిగించినంత పుణ్యఫలం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. ఇంటింటా వెలిగించిన దీపాలను గంగా హారతి అనంతరం కోనేటిలో వదలడం వల్ల గ్రహ, నక్షత్ర దోషాలతో పాటు శరీర, శత్రు దోషాలు తొలగిపోయి స్వామి అనుగ్రహం లభిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు.

అబ్బురపరిచే 108 రకాల హారతులతో

పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీ హోమం, కృత్తిక దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం హరిహర స్వామి కోనేరు వద్ద జరిగే గంగా హారతి వేడుక కనులపండువ చేయనుంది. ఇందులో భాగంగా ఏక, ద్వి, త్రి, పంచ, కుంభ, నక్షత్ర, అశ్వ, నవగ్రహ హారతులు సహా 108 రకాల హారతులు, సహస్ర హారతులను హరిహరులకు సమర్పించనున్నారు. అనంతరం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను కోనేటిలో వదలనున్నారు.
తరలిరానున్న ప్రముఖులు రానున్న ఈ అపురూప ఆధ్యాత్మిక వేడుకను తిలకించేందుకు పలువురు ప్రముఖులు రానుండటంతో ఉత్సవానికి విశేష ఆదరణ లభిస్తోందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ సిబ్బంది ఏర్పాట్లను ముమ్మరం చేశారు. నెలరోజుల పాటు విష్ణు ప్రీతిగా తులసి ఆరాధనలు, ఏకభుక్త ఉపవాసాలు ఈశ్వర ప్రీతిగా తెల్లవారుజామునే మహన్యాస రుద్రాభిషేకాలు, రుద్ర పారాయణాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఇల్లూరు గ్రామ పంచాయతీ చరిత్రకు ఘనమైన గుర్తింపు.. మాజీ సర్పంచ్‌లకు ఘన సన్మానం

- 1970లో ఏర్పాటైన ఇల్లూరు గ్రామ పంచాయతీ ప్రస్థానంలో మరో ప్రత్యేక ఘట్టం ఆవిష్కృతమైంది.





1970లో గ్రామ పంచాయతీ ఏర్పాటు అయినప్పటి నుంచి నేటి వరకు ప్రస్తుత సర్పంచ్‌తో కలిపి మొత్తం 9 మంది సర్పంచ్‌లుగా బాధ్యతలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే మంచి ఆలోచనతో, ?? గ్రామ అభివృద్ధి దార్శనికుడిగా నిలిచిన శ్రీమతి రేణుకా చౌదరి గారి ముఖ్య అనుచరుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జవ్వాజి ఆనందరావు గారి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడిందిలి ప్రస్తుత సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి గారి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన సర్పంచ్‌ల ఫోటోలతో ప్రత్యేక ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలాన్ని దానం చేసిన స్వర్గీయ శ్రీ జవ్వాజి జగన్నాధరావు గారు మరియు వారి ధర్మపత్ని స్వర్గీయ జవ్వాజి యశోదాదేవి గారి ఫోటోలను కూడా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. వారు నేడు మన మధ్య లేకపోయినా, గ్రామానికి చేసిన గొప్ప దానం మరియు అందించిన సహకారం ఎప్పటికీ గుర్తుండిపోయేలా వారి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపే ప్రయత్నం చేయడం జరిగింది. ??
ఈ సందర్భంగా విచ్చేసిన గౌరవనీయ మాజీ సర్పంచ్‌లను సాదరంగా ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేయడం జరిగింది. అదేవిధంగా, మరణించిన మాజీ సర్పంచ్‌ల కుటుంబ సభ్యులను ఆహ్వానించి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేయడం జరిగింది. ?? ఈ ఫోటో గ్యాలరీ ఏర్పాటు వెనుక ముఖ్య ఉద్దేశం మన ఇల్లూరు గ్రామ పంచాయతీ చరిత్రను ప్రతి ఒక్కరికీ తెలియజేయడం. గతంలో గ్రామానికి సేవలందించిన సర్పంచ్‌లను గౌరవించడం, గ్రామ పంచాయతీ కోసం స్థలాన్ని దానం చేసిన మహనీయుల సేవలను గుర్తుచేసుకోవడం మరియు రాబోయే తరాలకు గ్రామ చరిత్రను అందించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. గతాన్ని గౌరవిస్తూ.. చరిత్రను భద్రపరుస్తూ.. భవిష్యత్ తరాలకు మన గ్రామ ప్రస్థానాన్ని అందిస్తూ.. ఇల్లూరు గ్రామ పంచాయతీ చేపట్టిన ఈ కార్యక్రమం ఒక మంచి సంప్రదాయానికి నాంది పలికింది.
- కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు
- మాజీ సర్పంచ్‌లు మరియు ప్రస్తుత సర్పంచ్:
1. జవ్వాజి మోహన్‌రావు గారు (కుటుంబ సభ్యులు పాల్గొన్నారు)
2. కోట గోపయ్య గారు (కుటుంబ సభ్యులు పాల్గొన్నారు)
3. జవ్వాజి మోహన్‌రావు గారు (కుటుంబ సభ్యులు పాల్గొన్నారు)
4. కోట ప్రమీల గారు
5. చేతారు నాగేశ్వరరావు గారు
6. జవ్వాజి రంగారావు గారు
7. కోట సుధారాణి గారు
8. కోట రామారావు గారు
9. చేకూరి ఆదిలక్ష్మి గారు -- ప్రస్తుత సర్పంచ్
- ఇతర ప్రముఖులు:
- జవ్వాజి ఆనందరావు గారు
- కోట వీరయ్య గారు -- ఉప సర్పంచ్
- వార్డు సభ్యులు
- కట్ల సతీష్ గారు -- పంచాయతీ కార్యదర్శి
- గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు
- గ్రామ పెద్దలు
అనంతరం నిర్వహించిన ఆత్మీయ విందులో ప్రస్తుత సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, వారి కుటుంబ సభ్యులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని ఆత్మీయంగా గడిపారు.

భూములిచ్చిన రైతులకు పరిహారం ఎప్పుడు..?

- బుగ్గవాగు ప్రాజెక్టు భూసేకరణలో తమకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని విశ్వనాథపల్లి రైతుల డిమాండ్

కారేపల్లి, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్ -- రాములు): బుగ్గవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని విశ్వనాథపల్లి గ్రామ రైతులు అధికారులను డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం అభివృద్ధికి దోహదపడాలి తప్ప, అన్నదాతలకు అన్యాయం చేసేలా ఉండకూడదని స్పష్టం చేశారు. భూసేకరణ సమయంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది, తమకు రావాల్సిన పరిహారం, రైతుబంధు బకాయిలను వెంటనే చెల్లించాలని గ్రామసభ వేదికగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సోమవారం విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుగ్గవాగు ప్రాజెక్టుకు సంబంధించి నిర్వహించిన గ్రామసభలో అధికారులు ప్రాజెక్టు నిర్మాణం, కాలువలు, పైపులైన్ల మార్గం, భూసేకరణ వివరాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 2018లో నిర్వహించిన భూసేకరణ సర్వే సమయంలో కొంతమంది రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల్లో భూమి విస్తీర్ణాన్ని తగ్గించారని, అయితే ఇప్పటివరకు అందుకు సంబంధించిన నష్టపరిహారం చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తగ్గించిన భూమి విస్తీర్ణాన్ని తిరిగి పాస్ పుస్తకాల్లో నమోదు చేయడంతో పాటు, అప్పటి నుంచి నిలిచిపోయిన రైతుబంధు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా రైతుల భూముల్లో మట్టి తవ్వి కరకట్టలు నిర్మించినప్పటికీ నష్టపరిహారం అందలేదని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు జరిగిన నష్టాన్ని గుర్తించి తగిన పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభ్యంతరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భూముల విస్తీర్ణాన్ని పారదర్శకంగా నిర్ధారించిన తర్వాతే ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.



అభివృద్ధి పేరుతో అన్నదాతలకు అన్యాయం వద్దు

ప్రాజెక్టుల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తమ జీవనాధారమైన భూములను కోల్పోతున్న రైతులకు ముందుగా న్యాయం జరగాలని అన్నదాతలు స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ గ్రామసభలో కారేపల్లి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బానోతు పద్మ, ఇరిగేషన్ ఏఈ నాగయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అలీ అక్బర్, విశ్వనాథపల్లి సర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు.. జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మం: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో మంగళవారం పర్యటిస్తారు. తొలుత మధ్యాహ్నం 3:30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం నరసింహాపురం గ్రామంలో.. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవుతారు. తర్వాత మధ్యాహ్నం 3:50 గంటలకు ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ నాగండ్ల శ్రీనివాసరావు– రమాదేవి దంపతులు ఇటీవల హఠాన్మరణం చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 4 :30 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ గుర్రాలపాడు అభయ టౌన్ షిప్ వద్ద గుర్రాలపాడు నుంచి కోట నారాయణపురం వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పెద్ద తండాలో 25, 26, 27, 28 వార్డుల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5:30 గంటలకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని రామన్నపేట కాలనీ 60వ డివిజన్ లో అంతర్గత సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అంగన్‌వాడీ ఆయా కుసుమ మృతికి సర్పంచ్ మోతి వీరస్వామి ఘన నివాళి

- దశదిన కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాల.. కుటుంబ సభ్యులకు పరామర్శ

కారేపల్లి, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్ -- రాములు): అంగన్‌వాడీ ఆయా ఈసం కుసుమ మృతి పట్ల రేగులగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ వీసం మోతి వీరస్వామి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రేగులగూడెం గ్రామపంచాయతీ అనంతరం గ్రామానికి చెందిన కుసుమ గత వారం అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం నిర్వహించిన ఆమె దశదిన కార్యక్రమానికి సర్పంచ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కుసుమ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుసుమ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు అడ్డగోడ ఐలయ్య, ఈసం బాలకృష్ణ, ఇరప్ప చంద్రశేఖర్, కోరం శ్రీను, ఈసం భాస్కర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవేంద్ర, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొని కుసుమకు నివాళులర్పించారు.



సీపీఐ సీనియర్ సభ్యురాలు చిదుముల పుష్పమ్మ మృతి

- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



ఖమ్మంరూరల్ మన వెలుగు ప్రతినిధి: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు సత్యనారాయణపురానికి చెందిన సీపీఐ పార్టీ సీనియర్ సభ్యురాలు చిదుముల పుష్పమ్మ (80) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పుష్పమ్మ భర్త కీర్తిశేషులు చిదుముల జన్నయ్య సైతం సీపీఐ పార్టీ నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేశారు. మృతురాలికి కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణపురం సీపీఐ పార్టీ కార్యదర్శి చిదుముల బాబురెడ్డి, నాయకులు మామిళ్ల నిరంజన్ రెడ్డి, గూడ బాబురెడ్డి, కొలిచలం వెంకటరమణ, కొనకంటి రామకృష్ణ, అనుముల శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ.. సర్పంచ్ హీరాలాల్ చొరవ

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో అర్హులకు ఇళ్ల మంజూరు.. నిర్మాణ పనులకు శ్రీకారం

కారేపల్లి, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్ -- రాములు): పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ముందుకు సాగుతోంది. సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన దారావత్ కాంతి--నంద దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసేందుకు కృషి చేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని సర్పంచ్ ఆకాంక్షించారు.



గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు.. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

- వెల్‌నెస్ థెరపిస్ట్ పోస్టుల భర్తీకి ఈ నెల 25న ఇంటర్వ్యూలు.. సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ వెల్లడి

కారేపల్లి, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్ -- రాములు): గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినట్లు గాదెపాడు గ్రామ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన గిరిజన అభ్యర్థులకు వీక్యూరా వెల్‌నెస్ క్లినిక్ సంస్థలో వెల్‌నెస్ థెరపిస్ట్ పోస్టుల్లో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి ఈ నెల 25వ తేదీన ఉదయం 9 గంటలకు భద్రాచలం ఐటీడీఏలోని యువజన శిక్షణ కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన గిరిజన యువతీ యువకులు తమ విద్యార్హత, ఇతర సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఇటువంటి నియామకాలు మంచి అవకాశమని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రంజిత్ కుమార్ కోరారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9441390232, 6302608905 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



సింగరేణి రెవెన్యూ శాఖకు నూతన డిప్యూటీ తహసీల్దార్

- బోనకల్ నుంచి బదిలీపై వచ్చిన అజ్మీరా లక్ష్మణ్

బాధ్యతల స్వీకరణ.. ఘనంగా సన్మానం



కారేపల్లి, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్ -- రాములు): సింగరేణి మండల రెవెన్యూ శాఖకు నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా అజ్మీరా లక్ష్మణ్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా బోనకల్ మండలం నుంచి సింగరేణి మండలానికి బదిలీపై వచ్చిన ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది నూతన డిప్యూటీ తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువాలతో ఘనంగా సన్మానించి బాధ్యతల స్వీకరణకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సేవల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా పరస్పర సహకారంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మల్లెల రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని అజ్మీరా లక్ష్మణ్‌కు అభినందనలు తెలిపారు.

బయ్యారం సర్పంచ్ ఒంటెద్దు పోకడలపై డీఆర్వోకు ఫిర్యాదు

- మర్శకట్ల స్వర్ణాకర్ బీజేపీ ంఽ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి

?

బయ్యారం గ్రామ సర్పంచ్ ఒంటెద్దు పోకడలతో, అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కేవలం తన కుటుంబ సభ్యులకే మంజూరు చేయించుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి (గ్రీవెన్స్)లో డీఆర్వో (DRO) గారికి స్వర్ణాకర్ గ్రామ వార్డ్ మెంబెర్స్ మరియు గ్రామస్తులు తో కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

?ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ.. గ్రామంలో నిజమైన నిరుపేదలకు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందకుండా సర్పంచ్ అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తనకు, తన అన్నలకు, తన తల్లి పేరు మీద మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మరియు గేదెల వంటి ప్రభుత్వ పథకాలను మంజూరు చేయించుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ?ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బయ్యారం గ్రామంలో మంజూరైన పథకాలపై విచారణ జరిపించాలని, అక్రమంగా పొందిన లబ్ధిని రద్దు చేసి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



జాతీయ క్రీడల్లో సెయింట్ జోసెఫ్ విద్యార్థుల జయకేతనం

-- మాంట్‌ఫోర్ట్ క్రీడా పోటీల్లో 7 పతకాలతో సత్తా

-- బంగారు పతకం సాధించిన పి.ఉపాసన

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 23 (భద్రాద్రి న్యూస్) : హైదరాబాద్‌లోని బాయ్స్ టౌన్ పాఠశాలలో నిర్వహించిన 'మాంట్‌ఫోర్ట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ -- 2026' జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలం, రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ క్రీడా విభాగాల్లో పోటీపడిన విద్యార్థులు ఒక స్వర్ణం, ఒక రజతం, ఐదు కాంస్య పతకాలతో కలిపి మొత్తం ఏడు పతకాలు కైవసం చేసుకుని పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. జూనియర్ బాలికల జావెలిన్ త్రో విభాగంలో పి.ఉపాసన ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. సీనియర్ బాలుర 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్‌కె. అర్హాన్ అలీ రజత పతకం గెలుచుకున్నాడు. సీనియర్ బాలుర 200 మీటర్ల పరుగులో బి. మనీశ్వర్, జూనియర్ బాలుర 200 మీటర్ల పరుగులో పి. వినీత్ కుమార్, సీనియర్ బాలికల డిస్కస్ త్రోలో ఎన్. గాయత్రి కాంస్య పతకాలు సాధించారు. సీనియర్ బాలికల ఖో-ఖో జట్టు, 4ఐ100 మీటర్ల రిలే జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు (జట్టు విభాగం) కైవసం చేసుకున్నాయి. మార్చ్‌పాస్ట్ విభాగంలో పాఠశాల జట్టు మూడో స్థానం సాధించగా, షటిల్ బ్యాడ్మింటన్‌లో ఐ.యశ్వంత్, ఎస్.తేజ, పి.రాబిన్ జాషువా, ఎం.డి.తల్హా బృందం నాలుగో స్థానంలో నిలిచింది. జూనియర్ బాలికల 4ఐ100 మీటర్ల రిలేలో (పి.ఉపాసన, పి.జాహ్నవి, వి.శ్రేష్ఠ, ఎన్.అక్షయ జయన్) జట్టు, జూనియర్ బాలికల 100 మీటర్ల పరుగులో పి.ఉపాసన నాలుగో స్థానం సాధించి ప్రతిభ చాటారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు, తల్లిదండ్రులకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చిన క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం, స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల క్రమశిక్షణ, నిరంతర సాధన, క్రీడాస్ఫూర్తే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

